క్లుప్తంగా

సాగునీటి సమస్య పరిష్కరించాలి

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామంలో ఇరిగేషన్ డీఈ కామరాజు ఆధ్వర్యంలో పలువురు అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో చర్చించి పలు సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా వరి పంటకు సాగు నీరు అందడం లేదని, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం చింతలబడవంజ గ్రామంలో రూ.7లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సక్రమంగా అందివ్వాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, కొత్తూరు ప్రాజెక్టు సీడీపీఓ విమలకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు నీతూ, సర్పంచ్ ఊట లక్ష్మి, ఏపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొత్త పింఛన్లు, కాలనీలు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవటంతో అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని శ్యామలాపురం, గార్లపాడు, పెద్దకొల్లివలస గ్రామాలకు చెందిన వంశధార నిర్వాసితులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గోలుకుప్ప గిరిజన గ్రామాన్ని హేబిటేషన్‌గా గుర్తించాలని పలువురు గిరిజనులు విన్నవించారు.

కంటి శస్త్ర చికిత్సలకు 30 మంది ఎంపిక


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో బుధవారం రోగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 30 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య తెలిపారు. వీరికి జెమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి కొత్తూరు, భామిని మండలాలతోపాటు ఒడిశాకు చెందిన రోగులు అధిక సంఖ్యలో వచ్చారన్నారు.

రోజంతా ఆరు బయటే..


బయట వేచివున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల/బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు దసరా సెలవుల తర్వాత బుధవారం తిరిగి చేరుకున్నారు. ప్రిన్సిపాల్ వి.అర్చన విద్యార్థులను పాఠశాలలోనికి రాకుండా ఆవరణలో ఉంచేశారు. ఉదయం 9 గంటలకు తల్లిదండ్రులతో వచ్చిన విద్యార్థులను రోజంతా బయట ఉంచడంతో ఆందోళన చేందారు. విద్యార్థులు ఇంటికి వెళ్లి వచ్చినప్పుడు ప్రతీసారి ప్రిన్సిపాల్ ఇలాగే చేస్తున్నారని తల్లిదండ్రులు తెలిపారు.

దిక్సూచి పుస్తకాల ఆవిష్కరణ


దిక్సూచి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జలుమూరు: ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారు చేసిన దిక్సూచి పుస్తకాలు పదో తరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని ఫోరం కన్వీనర్ బమ్మిడి శ్రీనివాసరావు, హెచ్ఎం ఉంటి అప్పల సూర్యనారాయణ అన్నారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో దిక్సూచి పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. సులభ పద్ధతిలో ఎక్కువ మార్కుల సాధనకు ఇవి మరింత ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ఈ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జల్లు రమణ మూర్తి, విశ్వనాథం, దమయంతి, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

దళారుల దందా..!

- 80 కిలోల ధాన్యం బస్తా రూ.1450
- అదనంగా మూడు కిలోలు తూకం
- వ్యాపారి చెప్పిందే ధర
- తుఫాన్ హెచ్చరికతో పచ్చి ధాన్యం విక్రయిస్తున్న రైతులు


పచ్చిధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు


స్వల్పకాలిక వరి చేనును కోస్తున్న యంత్రం

సాగు విస్తీర్ణం ఇలా..

పాతపట్నం నియోజకవర్గంలో స్వల్పకాలిక వరి సాగు విస్తీర్ణం..

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	సాగుచేస్తున్న రైతులు
ఎల్.ఎన్.పేట	500	180
హిరమండలం	350	125
కొత్తూరు	380	210
పాతపట్నం	360	150
మెళియాపుట్టి	350	190

ఎల్.ఎన్.పేట: ఆరుగాలం శ్రమించి రైతు పంట పండించి దిగుబడులు అమ్ముకునే సమయంలో దళారుల బెడద ఎక్కువగా ఉంది. పంట కాలంలో వ్యాపారులు, దళారుల బారిన పడకుండా తప్పించుకోలేకపోతున్నారు. పంటకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతోపాటు ఇతర వ్యవసాయ పరికరాలు కొనుగోలు సమయంలోనూ అడిగినంత డబ్బులు చెల్లించక తప్పటం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగులో భాగంగా పండించిన స్వల్పకాలక వరి పంట గత కొన్ని రోజులుగా యంత్రాల ద్వారా కోతలు జరుగుతున్నాయి. కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్ హెచ్చరితో ఆందోళన

స్వల్పకాలిక పంట కోతకు వచ్చిన సమయంలో తుఫాన్ హెచ్చరికలు, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బలమైన గాలులతోపాటు వర్షం కురిస్తే పంట నష్టపోతామని భావించిన రైతులు ధాన్యం అమ్మకానికి సిద్ధం అవుతున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు ఇష్టం వచ్చిన ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

తూకం, ధరలోనూ మోసమే...

స్వల్పకాలిక వరి పంట కోసిన వెంటనే పొలం వద్దనే పచ్చిగా ఉన్న ధాన్యాన్ని రైతులు విక్రయిస్తున్నారు. 80 కిలోల ధాన్యం బస్తా కొలమానం అయినప్పటికీ దళారులు రైతుల వద్ద నుంచి అదనంగా 3 కిలోల ధాన్యం తీసుకుంటున్నారు. ధర విషయానికి వస్తే ధాన్యం బస్తా (83 కిలోలు) రూ.1450 కొనుగోలు చేస్తున్నారు. ధర పెంచాలని, ధాన్యం తూకంలో 3 కిలోలు తగ్గించాలని అడిగితే అమ్మితే అమ్మండి.. లేదంటే లేదు అంటున్నారు.

వ్యాపారులు అడిగినంతకే..



వ్యాపారులు వచ్చి ధాన్యం చూసిన తరువాత వారు అడిగినంత ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. కుటుంబమంతా కష్టపడి, అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పండించిన పంట తక్కువ ధరకు అమ్ముకోవాలంటే ఇబ్బందులు తప్పటం లేదు. ధర తగ్గినా ఫర్వాలేదు అనుకుంటే.. పచ్చి ధాన్యం అని చెప్పి అదనంగా మూడు కిలోలు తీసుకుంటున్నారు.

– శిమ్మ సింహాచలం, రైతు, బసవరాజుపేట, ఎల్.ఎన్.పేట

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



స్వల్పకాలిక వరిచేను కోతలు యంత్రాల ద్వారా ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో వ్యాపారులు చేస్తున్న మోసాన్ని తెలుసుకుంటాం. కనీస ధరతోపాటు తూకంలో జరిగే మోసాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. రైతులను మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

మెనూ అమలు చేయకపోతే చర్యలు

- ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి


మెళియాపుట్టి: పెద్దమడిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రాప్తికి భోజనాలు పెట్టాలని, లేకపోతే చర్యలు తప్పవని వార్డెన్ నర్సమ్మను హెచ్చరించారు. దసరా సెలవులు పూర్తయినప్పటికీ కొంత మంది విద్యార్థులు ఇంకా పాఠశాలకు రాలేదని గుర్తించారు. వెంటనే వారు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవన సముదాయాలను పరిశీలించి, త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పాతపట్నం: మండలంలోని ఎస్.ఎస్.మనుగు, బైదలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలను సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. భోజనశాల, స్టోర్ రూమ్ శుభ్రంగా ఉంచాలని, మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఎస్.ఎస్.మనుగు జీపీఎస్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పాతపట్నం సీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు, రికార్డులు పరిశీలించారు. సీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను సూపరింటెండెంట్ కె.కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. పెద్దసున్నాపురంలో ఉన్న వీడీవీకే సందర్శించి, గిరిజన ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, హెచ్ఎంలు, వైద్యులు పాల్గొన్నారు.

కార్తీక స్నానాలకు గోరువాని చెరువు సిద్ధం


గోరువాని చెరువును పరిశీలిస్తున్న సర్పంచ్, ఈఓ, తదితరులు

నరసన్నపేట: పంచాయతీకి చెందిన భక్తులు కార్తీక స్నానాలు చేసేందుకు వీలుగా సంతపేట సమీపంలోని గోరువాని చెరువును సిద్ధం చేస్తున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓ ద్రాక్షాయిని తెలిపారు. బుధవారం చెరువును ఉపసర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, ఎంపీటీసీ డేవిడ్, నేతింటి రాజేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భక్తులకు చెరువులో నాచు పట్టిన నీటిని తొలగించి, మళ్లీ మంచినీరు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికోసం పంచాయతీ నిధులు వెచ్చించనున్నామని ఈఓ ద్రాక్షాయిని తెలిపారు. చెరువులో జంగిల్‌ను తొలగించడం కూడా జరుగుతుందన్నారు. పంచాయతీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎస్టిమేషన్ మేరకు నిధులు మంజూరు చేస్తామని ఈఓ తెలిపారు.

తాగునీటికి కటకట..



ఈ చిత్రం ఆమదాలవలస మున్సిపాలిటీలోని ఒకటో వార్డు పార్వతీశ్వరునిపేటలో తాగునీటి అవస్థలకు అద్దం పడుతోంది. ఈ వార్డులో తిమ్మాపురం (మాదిగవీధి), జగ్గశాస్త్రులపేట, పార్వతీశ్వరునిపేట గ్రామాలకు తాగునీరు అందక నిత్యం ఆయా గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీటి ట్యాంకర్‌లు మొరాయించాయనే నెపంతో వారం రోజులకు ఒకసారి అయినా తాగునీరు సరిగా అందించడం లేదని పార్వతీశ్వరునిపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ఆమదాలవలస

అధ్వానం



ఈ చిత్రం నరసన్నపేట పట్టణ పరిధిలోని పాతబస్టాండ్ నుంచి కంబకాయకు వెళ్లే మార్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారి. 25 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి ఇది. వాహదారులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా భవనాలు నిర్మించడంతో మురుగు నీరు వెళ్లేంకు మార్గం లేక రోడ్డుపైకి చేరుతోంది. ఈ రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

– నరసన్నపేట

సాగునీటి కష్టాలు



ఈ చిత్రం మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామం వద్ద రహదారి మీదుగా పంట పొలాలికి మళ్లిస్తున్న సాగునీరు. ఎగువ పొలాల్లోని నీరు.. దిగువ పొలాల్లోకి రావాలంటే మధ్యలో (ఆల్ ఆంధ్రా) రహదారి ఉంది. నిత్యం వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రహదారి కల్వర్టు (ఖానా) లేదు. వేరే గత్యంతరం లేక రైతులు రహదారి మధ్యలో చిన్న కాలువలా తయారుచేసి నీటిని మళ్లించారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

మురుగుతీశారు.. మూత మరిచారు



ఈ చిత్రం పోలాకి పంచాయతీ వెదుళ్లవలస గ్రామంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న డ్రైనేజీ. ఇటీవల పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనుల్లో భాగంగా మురుగు తొలగించేందుకు డ్రైనేజీపై ఉన్న మూతలు తీశారు. వాటిని తిరిగి వేయకపోవటంతో విపరీతమైన దుర్గంధం వస్తోంది. రహదారిపై వెళ్లేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– పోలాకి

బోరు బాగుచేయరూ..



పాతపట్నం సీహెచ్‌సీ ఆవరణలో ఉన్న బోరు ఇటీవల మరమ్మతులకు గురైంది. ఆస్పత్రిలో ఉండే రోగులు, ఆస్పత్రి సిబ్బంది తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ లేనప్పుడు ఈ బోరు ఎంతో ఉపయోగపడుతుంది. ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు వద్ద ప్రస్తవించగా.. బోరును బాగుచేయాలని ఎంపీడీఓకు తెలియజేశామన్నారు.

– పాతపట్నం

వసతి గృహాల తనిఖీ


నరసన్నపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి


పాతపట్నం: ప్రహరాజపాలెంలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి రోషిణి

నరసన్నపేట: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.హరిప్రియ బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని సౌకర్యాలు, భోజన సదుపాయాలు గురించి ఆరా తీశారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు, రన్నింగ్ వాటర్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని అడిగారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. బియ్యం, నిత్యవసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. మేట్రిన్లు ప్రభావతి, పద్మావతి, ఏజీపీ గొండు సత్యనారాయణ, న్యాయవాది ఎం.ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరాజపాలెంలో..

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న ఎస్టీ కళాశాల బాలికల వసతి గృహాన్ని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి బుధవారం రాత్రి తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థుల హాజరు, స్టోర్ రూమ్ రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న బాలుర ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని పరిశీలించారు. ఆ సమయంలో వసతి గృహం వార్డెన్ లేకపోవడాన్ని గుర్తించారు. మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెట్టడం లేదని, గుడ్లు వారంలో రెండు రోజుల మాత్రమే పెడుతున్నారని జడ్జి దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


విచారణ నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బొబ్బాది ప్రియాంకపై డ్వామా ఏపీడీ లోకేష్ బుధవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 19 మంది వేతనదారులు పనికి రాకుండా వేతనాలు ఇస్తున్నారని అధికార పక్షానికి చెందిన వారు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య వాగ్వావాదం జరిగింది. ఎస్ఐ దుర్గాప్రసాద్ వారిని సర్ది చెప్పారు. అనంతరం గ్రామంలో కొంతమంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. విచారణలో ఏపీఓ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష పూరితమే..

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, కావాలనే అధికార పక్షం వాళ్లు తప్పుడు ఫిర్యాదులు చేశారని ఎంపీటీసీ గదిలి మల్లేశ్వరరావు, సర్పంచ్ ఎండ కృష్ణవేణి అన్నారు. విచారణ అనంతరం వీరు మాట్లాడుతూ.. ప్రియాంకను తొలగించాలనే కక్షతోనే ఈ విచారణ నిర్వహించారన్నారు. ఆమె ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉండాలని వీరు డిమాండ్ చేశారు. గ్రామంలో మెజార్టీ వేతనదారులు ప్రియాంకకు మద్దతుగా నిలిచారు. విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎటువంటి అభియోగాలు రాలేదన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


పొందూరు: రాపాకలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ బాబ్జి

పొందూరు: మండలంలో వరి పంట వేసిన రైతులంతా సుడి దోమతో అప్రమత్తంగా ఉండాలని ఏఓ బెండి బాబ్జి సూచించారు. బుధవారం రాపాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. రాపాకలో సుడిదోమ వ్యాపించిన పంటకు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొత్తూరు: వరి పంటకు దోమ పోటు వస్తే తూటి కాడ ద్రవాణం పిచికారీ చేయాలని స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ రాజగోపాలరావు సూచించారు. మండలంలోని పారాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉత్తమ రైతు కుంచాల చిన్న వరి పొలాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు పాటించాలని ఏఓ స్వర్ణలత అన్నారు. ఎంటీ సూర్యనారాయణ, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: రైతులు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.సునీత రైతులకు సూచించారు. తామరాపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరుకు ఆశిస్తున్న తెగుళ్ల గురించి వివరించి తగిన సూచనలు చేశారు.

మెళియాపుట్టి: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సుడిదోమ, పాముపొడ తెగులు, అగ్గి తెగులును నివారించవచ్చని ఏఓ ధానకర్ణుడు అన్నారు. పెద్దపద్మాపురం, సిరియాఖండి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

సైబర్ మోసాలపై అవగాహన

ఆమదాలవలస: సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డి.సి.సి.బి సీఈఓ డి.వరప్రసాద్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు చింతాడలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఎవరైనా ఏటీఎం పిన్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను అడిగితే చెప్పవద్దన్నారు. బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్లు చేసి వివరాలు అడగరని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ గురించి వివరించారు. పట్టణ డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ సంధ్యారాణి, మున్సిపల్ మెప్మా సీఓ నాగమణి, డీసీ హరనాథ్, సీఎఫ్ఎల్ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం


బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆమదాలవలస: మండలంలోని తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తొగరాం మెడికల్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆహార భద్రత, సమతుల్య ఆహారం విశిష్టతను తెలియజేశారు. జనాభాలో అధిక శాతం మందికి ఆహారంపై అవగాహన లోపం వల్ల ఆర్థిక వ్యవస్థ నాశనానికి దారితీస్తోందన్నారు. సభాధ్యక్షుడు, అర్థశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ డి.పైడితల్లి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ప్రపంచ ఆహార దినోత్సవం ప్రధాన ఉద్దేశాన్ని, మెరుగైన జీవితం – భవిష్యత్‌కి ఆహారపు హక్కు అనే థీమ్ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమ సమన్వయకర్తగా వై.రమణమూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పోస్టర్ ప్రజెంటేషన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సీతారాం, అచ్యుతరావు, కాశీరత్నం హారిక, శ్రీనివాసరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో నట్టల నివారణ మందులు వేయాలి


సరుబుజ్జిలి: నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి సతీష్‌కుమార్


కొత్తూరు: గొర్రెలకు మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

సరుబుజ్జిలి: గొర్రెలు, మేకలకు సకాలంలో నట్టలనివారణ మందులు వేయాలని మండల పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని తెలికిపెంట పంచాయతీ పరిధిలోని ఎల్‌ఏపీఎం అగ్రహారం గ్రామాల్లో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతున్న నట్టల నివారణ మందులు కార్యక్రమాన్ని పెంపకందారులు వినియోగించుకోవాలని సూచించారు.

కొత్తూరు: గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ మందులను వేయాలని స్థానిక పశువైద్య ఆస్పత్రి ఏడీ నారాయణరావు సూచించారు. మండలంలోని కల్లెమ్మ గ్రామంలో డీ వార్మింగ్ మందులను వేశారు. ఏడీ మాట్లాడుతూ మూగజీవాలు, పశువులకు సంబంధించిన మందులన్నీ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి హరికృష్ణ, పశు సంవర్థక సహాయకులు పాల్గొన్నారు.